మూఁగ కతలు :

# శుకాలాపము

* పూడిపెద్ది వెంకటరమణయ్య *

నాకు చిన్నప్పటినుండీ రామనామమే పలకడమంటె మిక్కిలి యిష్టం. ఆ నామమహిమ అందరికీ, అనగా నా కంటఁబడినవాళ్ళందరికీ, ఉపదేశిస్తూ తిరుగుతూ ఉండేవాణ్ణి.

నింగిచూస్తే రాముడు స్ఫురణకు వచ్చేవాడు. నేల చూస్తే సీత జ్ఞాపకమునకు వచ్చేది. భూమ్యాకాశములనడుమనేగదా భూలోకంమరి.

నాకు ఆమేఘశ్యాముడు భూమిజాతో జ్ఞప్తిం దగలని నిమేషములే లేవు. వారిని తలచికొని పులకించిపోయేవాణ్ణి. మనసారా ఆ పుణ్యదంపతులను స్మరించేవాణ్ణి. "రామారామా" అంటూ నిర్జన ప్రదేశాలకు బోయి నిత్యమూ భజనచేస్తూ ఉండేవాణ్ణి.

ఎఱ్ఱని పెదవులు, ఇందీవరములవంటి కన్నులు, నాకు రామశబ్దముతో నిండినదగుటచేత నాగళానికి మేఘవర్ణంవచ్చి, రాముణ్ణే తలచుచుండుటచేత దూర్వాంకురదళశ్యామలము నా శరీరాన్ని పొడమింది.

నేనే తరుచ్ఛాయనో నిల్చి సభక్తికముగ కన్నులమూసికొని రామారామాయని స్మరించునప్పటికి ఆ పరిసరాలన్నీ పవిత్రములయిపోయేవి. ఔను, రామనామముకంటె మధురమయినదేది ?

ఈ ప్రాపంచికలంపటములం దగుల్కొని లేనిపోని యాతనలపాలయి క్రుక్కనుడియుటకంటె నరణ్యావాసమున రామనామస్మరణైక జీవినై కాలము గడపుకొనుటే సమంజసమని. ఒకనాటి వేకువన మేల్కొని నిర్మోహుడనై బుద్ధభగవానునట్లు నామనికిపట్టు పరిత్యజించి ఘోరాటవులబట్టిపోయాను.

'అక్కడి డిగ్గియల నీరు ద్రావి అందే లభించిన కాయకసరుల దిని, అచటి కొమ్మల నీడల నిద్రించుచు ప్రహ్లాదుని సైతము మించిన భక్తుడనయిపోయినాను. అచ్యుతచ్యుత తపమాచరించు మౌనులు సైతము నిశ్చేష్టులై నా భక్తి కబ్బురమందేవారు.

"కాల మొక్క రీతిఁ గడవబోదు." నేను నిర్దోషిని, ఏ పాపమెరుగను. ఎవరిని హింసింపలేదు. పరధన మపహరింపలేదు. అది యగోచరమయిన యే కర్మఫలమో నాకు తెలియదు.

ఆనాటి సంధ్యాసమయమున చల్లగాలిలో కొంతసేపు విహరించి సృష్టివైచిత్ర్యంబుల మెచ్చికొని తలయూచి రామనామ మూదికొనుచు కొంతవడికి నా విడిదికి తిరుగు మొగమై వస్తున్నాను. ఆ మాపున ఫలాహారమున కొక్క పలుకు బారిన పండొక్కటేరికొని చేతబట్టుకొని రామనామముతో లీనమయి మరీ వస్తున్నాను.

ఆ కొమ్మలచాటున నేదో చడి. ఏ చడియైతే నాకేమి—"ఒరులుగారు నాకు నొరులకు నేఁగాను."

అసిధారావ్రతమున తపస్వినై కాలంగడుపుతూన్న నాకేమి భయము అనుకొని, నా చెట్టు మొదటింజేరి, ఆ నేల నించుక శుభ్రపరచికొని ఒక పండుటాకున నా దెచ్చికొన్న ఫలము ముంగలబెట్టికొని, కన్నులు మూసికొని 'రామా రామా' యని లోలోన స్మరణచేసికొంటున్నాను.

ఆ భక్తిపారవశ్యతలోనున్న నా వెన్నుమీద నెవ్వరో చేయివేసి తట్టినట్లయినది. ఆహా భక్తవత్సలా ! కరుణానిధీ ! రామా! భక్తులను మెచ్చికొని నీవొసర్చిన కార్యము లనేకములు. నాడు ఉడుతను దువ్విన నీ యంగుళ్యగ్రముల నా మేను నిమురుచున్నావా ! దయాసాంద్రా నీ వాత్సల్యమునకు మేరలేదు. నేడు నేను ధన్యుడనయితిని"

అని స్తుతించుసమయమున నెవ్వడో నన్ను పెడరెక్కల విరచికట్టి నన్నీడ్చికొనిపోవుచున్నాడు.

నాకేమియు తెలియక రామారామాయని వాపోవుచున్నాను. కట్టివైచి యీడ్చుచుండుటచేత మే నలసిపోయినది. రామారామాయని యఱచుటచేత నోరలసినది. కొంతమేర పోవునప్పటికి నేను మూర్ఛబడితిని.

## 2

నేను కన్నులు విప్పునప్పటికి మిరుమిట్లు పొడమినవి.

అది దివ్యసౌధము.

దేవేంద్రలోకము కాబోలు-అయ్యో నిష్కారణముగ భయభ్రాంతులం దగుల్కొని వాపోయి వాడిపోయితినే! ఏ పాప మెరుగని భక్తుల కాపదలు వాటిల్లునా ? వట్టిమాట.

శ్రీరామచంద్రు డంత దయావిహీనుడా ? శత్రులకు సైతము సాయుజ్యమిచ్చిన రాముడు నన్నాపదల జిక్కద్రోయునా ? అతడు నేడు నా యందనుగ్రహించి ప్రచ్ఛన్నము నన్ను చేపట్టి ఈ దివ్యలోకమునకు గొనివచ్చినాడు.





బిటాలాక్స

చాక్లెట్ భేదిబిళ్లలు. సుఖవిరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తినిచ్చును. వాడుకొనువిధము పొట్లములో నుండును. పొట్లం 2 బిళ్ళలు 1 అణా

అన్ని మందుల షాపులలోను లభ్యమగును.

Stockists:
Messrs, Dadha & Co., P. T., Madras.
Manufacturers:
**BOMBAY TABLET MFG. CO.**
P. O. Box No. 2092. BOMBAY. 2


"ఓహో-గంధర్వులగానము - అచ్చరల నాట్యము-ఇది ఇంద్రసభ కాబోలు - అయియుండును. ఇంద్రునకు నన్నొప్పించినను దేవతలలో నొకనిగా పరిగణింపుమని చెప్పుటకయి శ్రీరాముడే నన్నిటకు గొనివచ్చినాడు-నా జన్మ నేడు సార్థకమయినది. ఆ శుకాదులకైన లేని అందని రామవాత్సల్యము నాకు నేడు చూరలెట్టినాడా రాముడు. దీనపాలకుడు-భక్తపక్షపాతి-ధన్యోస్మి - ధన్యోస్మి-నేడు గదా సుదినము."

నేనిలాగా ఆనందతరంగాలలో ఉయ్యాలలూగుతూ, అచటి మధురధ్వనులకు పులకిస్తూ, ఆనందబాష్పాలు కన్నులనించుతూ, ఇంద్రలోక నివాససౌఖ్యాన్ని అనుభవిస్తూ బాహ్యప్రపంచాన్ని మరచిపోయాను.

ఇంతలో నా కట్లు బాసినవి. ఇక్కట్లుకూడా బాసినవనే చెప్పవచ్చును. నేను ధైర్యముగా కన్నులు విచ్చి నలువంకలా పరీక్షించాను.

నా యెదుట నెవ్వడో మహాపురుషుడు, కలకలలాడే నవ్వుమొగమువాడు, తనచేత నింతవరకు కట్టబడిన నా మేను నిమిరి సేవకు నొకని జేర బిలచి "ఓరీ! వీని నంతఃపురమునకు గొంపొమ్ము, నేను నిప్పుడే వచ్చెద" నన్నాడు.

అబ్బ! నా కెంతటి గౌరవము! అంతఃపురమునకుగూడ పోవడానికి అడ్డులేదు. నన్నాతడు పోల్చికొన్నాడు. నేను రామభక్తుడనని తెలిసికొన్నాడు. కేవలము దుంపలదూలల దిని వనంలో కాలంగడపుతూన్న తపస్వినని పోల్చాడు. సాధువునని సంతోషించేడు. తన యిల్లాండ్రకు రాజు కాబోలు! తదితర స్త్రీజనమ్ములకుకూడా రామనామ మహిమను చెప్పమంటాడు కాబోలు-నా బోధనవల్ల వారినందరినీ రామభక్తులుగ చేయమంటాడు కాబోలు.

సరే ఏమి చేయమంటాడో ? చూచుకొందామనుకొన్నాను. ఇప్పటికే రాత్రి చాల మించిపోవడంచేత నాకు నియమించిన ఒకచోట నిద్రాసక్తుడనయి పండుకొన్నాను.

## 3

మెలకువ వచ్చినది. ఆకాశమున గంధర్వగానంలాగా పులుగుల పాటలు వినబడుతున్నాయి. మందమందంగా కమ్మని గాలి పూలతోటలమీద నుండి వీస్తూంది. ఆ సమయం మధురంగా ఉంది.

రాత్రి ఈ సందడిలో నేమియు తినలేదు. ఇప్పుడెక్కడికయిన పోయి పండ్లేరికొని తెచ్చుకోవాలి. అని మెల్లగ లేచి ఒడలు సవరించుకొని యావులించి బరువుబరువు రెప్పల నించుక విదల్చి లేచి నిలబడ్డాను.

"ఏమిది! నా కన్నులనే నేను నమ్మలేకున్నాను. ఇన్నింకను నిద్ర విడువలేదు కాబోలు! కలకంటున్నానేమో. కాదే, తెలివిగా నున్నానే, నిజమేనా? అయ్యో - అయ్యో - ఎంత మోసం! ఎంతఘోరం, ఎందుకీ సాధుహింస, నేనేమి నేరం చేసేను. ఏమి కానిపనులు చేసేను.

ఎవరి యూనూ లేకుండా నా యాశ్రమంలో నా కాయకసరులు తింటూ కాలం గడుపుకొంటూన్న నాకు అగచాట్లెందుకు! ఇంతకూ నాపయి నేరము మోపి దానిని స్థిరపరచి గదా నన్ను శిక్షించాలి. ఊరకే అసుర సంధ్యవేళ వచ్చి నన్ను పెడ రెక్కల విరచిగట్టి రాజసభ కీడ్చికొనివచ్చి నాకేమియు చెప్పక, ఇట్టి కారాగృహమున పడ వేయడ మేమి న్యాయము! అయ్యో, ఇక నాకు దిక్కెవరు. ఈ యినుపగజములలో కాలుసేతు లాడని ఈ యిరుకుచోటులో నే నిలా పడి యుండవలసినదేనా?

ఔరా! రామనామస్మరణమే దోసమయినదా? రాగము లేని జీవనమే దోసమయినా? ఈ యరణ్యరోదనము, కాదు, అరణ్యావాస మెంత సౌఖ్యదము! అక్కడ రోదనమే యెరుగనే స్వేచ్ఛ నిత్యానందముతో నింగి నందుకొనే వాడనే.

అయినది, అన్నియు వడగినవి, కడకు కారాగృహవాసమున కాలము గడపవలసిన దురవస వచ్చినది. "రామా! రామా!" యని పెద్దకేక పెట్టేను. అక్కడి కావలివాండ్రు నా చుట్టును చేరి 'కృష్ణ! కృష్ణా!' యని యొకడూ, 'కూర కూరా' అని ఇంకొకడును నన్ను వెక్కిరించేరు. నేను కన్నీరు నించేను.

ఈ తరువాతి నా జీవితము చెప్పదగినది కాదు. నేను స్మరింపనూ కూడదు. నేనెంతవరకూ వానినయిన నేమి? ఎంత తపస్వినయిన నేమి, ఫలాపేక్ష విడవలేకపోయితిని.

* దానివలన నీ యిక్కట్టు, కట్టు సంభవించినది పోనీ.

# వ్యాసకర్తలకు:

★

- రచనావ్యాసంగానికి మీరు క్రొత్తవారే కావచ్చు. ఐనా లోకానికి తెలపవలసిన కొన్ని కొత్త విషయాలు మీలో ఊర కలువేస్తూ వుండి వుంటాయి. కాబట్టి ఎట్టి సంకోచమూ లేకుండా ఉత్సాహంతో ప్రయత్నించి మీ రచన మాకు పంపండి. ఏమాత్రం బాగున్నా సవరించి ప్రచురించడానికే సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాము.
- హాస్యప్రధానమైన వ్యాసాలకు ఆనంద వాణి ప్రాధాన్య మిస్తుంది.
- తప్పనిసరి ఐతేకాని రచనలలో ఇంగ్లీషు పదాలు వాడకూడదు.
- వినోదము కలిగించె విజ్ఞానదాయకమగు చిన్న చిన్న రచనలయితే వేగంగా ప్రకటింప వీలవుతుంది.
- కొత్త సమస్యలకు సంబంధించి, ప్రసాదమైన హాస్యధోరణిలో ఉంటే తప్ప పద్య వ్యాసములు పంపవద్దు.
- ప్రతి వ్యాసంతోనూ మూడు కాన్ల పోస్టు బిళ్లలు పంపితేనే ప్రకటించె పక్షాన తెల్పడానికీ, నచ్చకపోతే వాపసు చేయటానికీ వీలవుతుంది. కార్డులు జతపర్చవద్దు.
- ప్రతివ్యాసంపయినా వ్యాసకర్త పూర్తి చిరునామా ఉండాలి.
- సరసమయిన ఊహలు కల్గి, వినోదింపజేసే వ్యంగ్యచిత్రాలనుకూడ ప్రచురణకు పంపవచ్చు.
- రచనలు, చిత్రాలు వ్యక్తుల పేర గాక— 'ఆనందవాణి' సంపాదకునకు 12 తంబుశెట్టి వీథి, పోస్టుబాక్సు నం. 1588 మదరాసు-' అని వ్రాయాలి. లేకుంటే వ్యాసపరిశీలనము ఆలస్యము కావచ్చు.

—సంపాదకుడు